

కాంగ్రెస్ హయాం రైతులకు శాపంగా పరిణమించింది. కరువుకుతోడు ప్రాజెక్టులు పెండింగ్‌లో పెట్టడంతో క్రాప్ హాలిడే ప్రకటించాల్సిన దుస్థితి. తెలంగాణ వచ్చాక కేసీఆర్ ప్రభుత్వం చేపట్టిన ప్రాజెక్టులు, ఇతర పథకాలు బీడు భూములను సస్యశ్యామలం చేశాయి. తెలంగాణ ప్రాజెక్టుల రూపకల్పనపై ఇతర రాష్ట్రాలవారూ ఆసక్తి కనబరుస్తున్నారు. ఇక్కడ ప్రభుత్వం కల్పించిన సాగునీటి సదుపాయాలపై లోతైన విశ్లేషణలను పాఠ్యాంశాలుగా కూడా బోధిస్తుండటం విశేషం.

**ముందుకు పోదామా! ఎన్కకా!!**

## మా సాగు ఐఏఎస్‌లకు పాఠమైంది

**ఊరి** చెరువు కింద మాకు చెల్క పొలం ఉన్నది. తెలంగాణ రాకముందు చెరువు ఎప్పుడు ఎండిపోయే ఉంటుండె. నేను ఎమ్మెస్సీ, బి.ఎడ్ చదివిన. మా నాన్న కరువుకాలంలో ఎవుసం చేసిండు. నాకు ఉద్యోగం రాలే. ఇక తప్పక ఎవుసంలోకి అచ్చిన. ఒకప్పుడు నీళ్లు లేక చెరువు కిందనే పత్తి పండించేది. పత్తి, మక్కలు, పెసర్లు, ఆవాలు ఏసేది. నీళ్లు లేక పంటలు సరిగ్గ పండకపోతుండె! ఊర్లల్ల ఎప్పుడూ కరువే ఉంటుండె. తాగనీకి నీళ్లు ట్యాంకర్లల తెచ్చుకున్నట్టు.. కాపుకొచ్చిన పంటను కాపాడుకోనీకి ట్యాంకర్లల్ల నీళ్లు తెచ్చుకున్నం. ఒకసారి ఊర్ల బాయిలన్నీ ఎండిపోయినయ్. చెరువు కింద ఉంటుడ్తోని మా బాయిల నీళ్లుండె! పంట చేతికొచ్చే టైమది. చుట్టుపక్కల రైతులు మా బాయిల నీళ్లు కొనుక్కుపోయేది. ఒకసారి మా బాయిగిన ఎండిపోయింది. నాకు కూడా నీళ్లు కొనుడు తప్పలేదు. దీంతోని మస్తు అప్పులైనయ్. ఇప్పుడు కాళేశ్వరం నీళ్లొచ్చి నాంక మా చెరువు ఎప్పుడు నిండుగ ఉంటున్నది. బాయిల నీళ్లు పైకొచ్చినయ్. ఎండకాలంల గిన నిండుగ ఉంటున్నది. కాళేశ్వరం నీళ్లతోని మా కరువు నేల కన్నీళ్లు దూరమైనయ్. సిరిసిల్ల సస్యశ్యామలమైంది. మూడు పంటలు పండించుకుంటున్నం. మస్తుగ పైసలొస్తున్నయ్. వేములవాడ కరువు నేల ఐఏఎస్ ఆఫీసర్లకు పాఠమైంది. ట్రైనీ ఐఏఎస్‌లు మా ఎవుసం గురించి తెలుసుకోనీకి ఫీల్డ్ విజిట్ చేసి పోయిన్రు.

• నల్లా తిరుపతి రెడ్డి, రైతు, శాత్రాజుపల్లి, వేములవాడ మండలం, రాజన్న సిరిసిల్ల జిల్లా



నేడే పోలింగ్

హైదరాబాద్ | గురువారం 30 నవంబర్ 2023 నమస్తే తెలంగాణ

# తెలంగాణ జైత్రయాత్ర 2023

www.ntnews.com

I



## నేను కోరుకున్న తెలంగాణ..

నాకు తెలంగాణ తెచ్చిన పేరే ఆకాశమంత పెద్దది. దానిని మించిన పదవి ఉన్నదా? నేను కొట్లాడేది నా పదవుల కోసం కాదు. నా తెలంగాణ కచ్చితంగా వంద శాతం పేదరికం లేని రాష్ట్రం కావాలి. నా తెలంగాణ వంద శాతం అక్షరాస్యత కలిగిన రాష్ట్రంగా మారాలి. నా తెలంగాణలో ప్రతి ఇంచు భూమికి నీళ్లు రావాలి. నా తెలంగాణ బ్రహ్మాండమైన పంటలు పండే రాష్ట్రం కావాలి. నా తెలంగాణ రైతాంగం గుండెల మీద చేయి వేసుకొని హాయిగా నిద్రపోవాలి. నా తండ్లాట వీటి కోసమే!

▪ కేసీఆర్



**ఏ తల్లి అయినా బిడ్డకు జన్మనిస్తుంది. పెంచి పెద్ద చేస్తుంది. కానీ నా బిడ్డ.. కల్వకుంట్ల చంద్రశేఖర రావు మాత్రం రాష్ట్రాన్ని సాధించి.. తెలంగాణ తల్లిగా నాకు ఉనికినిచ్చాడు. నా విగ్రహాన్ని పల్లె పల్లెకూ తీసుకెళ్లాడు. కాళేశ్వర జలాలతో పాదాభిషేకం చేశాడు. ఇలాంటి బిడ్డను కనడం తల్లిగా నా అదృష్టం. ఇలాంటి నాయకుడు పాలకుడు కావడం తెలంగాణ ఓటర్ల పూర్వజన్మ సుకృతం. లీడర్లదేముంది గల్లీకొకరు ఉంటారు. కానీ, ఢిల్లీని ఎదిరించి అయినా సరే.. తెలంగాణ ప్రయోజనాలను కాపాడే యోధుడు.. నాలుగు కోట్ల మందికి ఒక్కడే ఉన్నాడు. కేసీఆర్‌ను గెలిపించడం మీ బాధ్యత.**

... కరణం జనార్దన రావు

# పెద్ద కొడుకే.. పెద్ద దిక్కు!

**మహాకవి** పోతన అనుభవించిన కష్టమే మళ్లీ మనకు దాపురించింది. చుట్టూ మన శత్రువులే. 'నా తెలంగాణ తల్లి ఆత్మగౌరవాన్ని కర్ణాటక కిరాతుల సామంతులకో, నానమ్మ పేరు చెప్పుకొని బతికే వాజమ్మలకో తెగనమ్మను.. త్రిశుద్ధిగ నమ్ము భారతీ' అని మాటివ్వండి నాకు. నేలకు నీళ్లిచ్చిన వాడికి, పంటకు నిధులిచ్చినవాడికి, పెద్దలకు పింఛన్లు ఇచ్చినవాడికి, పాత బస్తీలో టెన్షన్లు తగ్గించినవాడికి.. తెలంగాణ కోసం తన జీవితాన్నే ఇచ్చినవాడికి.. మీ ఓటు ఇవ్వండి చాలు. తెలంగాణ తల్లినైన నాకు మీరు చేయాల్సిన వాగ్దానమిది.

**పిడికిలి** బిగించిన ప్రతిసారీ.. నినాదాలు హోరెత్తిన ప్రతిచోటా.. ఉద్యమం రాజుకున్న ప్రతి మూలా.. లాఠీల విహారాలు, తుపాకుల మోతలు. వాలిన తలలు, కూలిన కలలు. తల్లిగా నేనెంత తల్లడిల్లానో! ప్రేమగా ఉయ్యాలలూపిన చేతులతో పాడె మోయాల్సి రావడం ఎంత విషాదం! అయినా అమరుల త్యాగాలు సాకారం కాలేదు. ఆకారం దాల్చలేదు. ఐదున్నర దశాబ్దాలు చీకట్లోనే మగ్గాను. అభివృద్ధికి నిధుల్లేవు. సేద్యానికి నీళ్లు లేవు. పిల్లలకు నియామకాలు లేవు. అన్నింటా వివక్ష. ప్రశ్నించే గొంతుల్లేవు. నిలదీసే దమ్ముల్లేవు. ఢిల్లీ పెద్దలకు గులాములు. ఆంధ్రా పాలకులకు సలాములు. కాకతీయుల రోషమేమైంది? సర్వాయి పాపన్న పౌరుషమేమైంది? ఉగ్గుపాలతో నేను రంగరించిన ఆత్మాభిమానాన్ని తాకట్టుపెట్టి నిస్సిగ్గుగా బతకడమేంది?.. నా తల్లి గుండె తల్లడిల్లింది. కండ్లకు ఒత్తులేసుకుని.. మార్పు తీర్పు కోసం ఎదురుచూసింది. ఆ రోజు రానేవచ్చింది. చంద్ర గ్రహణాన్ని దాటుకుని వచ్చి.. ఉద్యమాల సూర్యుడు ఉదయించాడు.

❖ ❖ ❖

**పదవులు** వదులుకొని.. హోదాలు వద్దనుకొని.. కేసీఆర్ తెలంగాణ ఉద్యమాన్ని భుజానికి ఎత్తుకున్నప్పుడే.. 'జై తెలంగాణ' నినాదంతో పిడికిలి బిగించినప్పుడే.. అర్థమైపోయింది. దశాబ్దాల పోరు హోరెత్తుతుందని, ప్రత్యేక పోరు పతాక స్థాయికి చేరుతుంది. కేసీఆర్ తెచ్చుడు.. రాష్ట్రం వచ్చుడు.. ఖాయమని. న్యాయమని. చుక్క నెత్తురు పారకుండా, ఒక్క ప్రాణం చేజారకుండా, నక్కజిత్తులను చిత్తుచేసిన బక్కపలచని ఉద్యమకారుడు నా బిడ్డ కేసీఆర్. అతని వ్యూహం అనూహ్యం. మాట మరఫిరంగి. ఉపన్యాసం ఉద్యమ ఉత్ప్రేరకం. పదవులు తృణప్రాయాలు. ఎన్నికలు అస్త్రశస్త్రాలు. రాజీనామాలు రాజీ తెలియని సంకల్పాలు. సిద్దిపేట ఉప ఎన్నిక మొదలు.. స్వరాష్ట్రంలో జరిగిన తొలి సార్వత్రిక ఎన్నికల వరకూ.. అన్ని ఫలితాలూ నా బిడ్డకు అనుకూలమే. ప్రతి మజిలీలో జనం బిజిలీ పట్టి స్వాగతం పలికారు. ఉద్యమకారుడైన ముఖ్యమంత్రిగా పాలననూ ఓ ఉద్యమంలానే భావించాడు కేసీఆర్. నిన్నటి పాలన లోపాలను సరిదిద్ది, అప్పటి పాలకుల పాపాలు కడిగేసి.. తెలంగాణను నంబర్ వన్‌గా తీర్చిదిద్దాడు. కేసీఆర్ ఆరంభించిన ప్రతి సంక్షేమ పథకం నా మెడలో ఓ పచ్చల పతకం.

**పదేండ్ల** తెలంగాణ.. దేశానికే అన్నం గిన్నె. గాదెలు నిండాయి. గోదాంలు కళకళలాడుతున్నాయి. తెలంగాణ సౌభాగ్యాన్ని చూసి నా కడుపు నిండుతున్నది. అమ్మకే గోరుముద్దలు తినిపించే బిడ్డ.. ఈ గడ్డ మీద తప్ప ఇంకెక్కడా కనిపించడు. ఇలాంటి తనయుడికి తల్లిగా నేను, ఇలాంటి నాయకుడి ఓటర్లుగా మీరు గర్వించాలి.

❖ ❖ ❖

**కుంతీదేవికి** ఐదుగురు పిల్లలున్నా.. భీముడంటే ప్రత్యేక మమకారం. పాండవులకు చేతిముద్దలు పెడుతున్నప్పుడు.. వాయుపుత్రుడి వంతు వచ్చేసరికి ముద్ద పెద్దది అయ్యేది. ఆ విషయం గుర్తించాడు ధర్మరాజు. తన మనసులోని సందేహమూ వెలిబుచ్చాడు. 'నాయనా! ఏ తల్లి అయినా పిల్లల కడుపు చూస్తుంది. భీముడికి ఆకలెక్కువ. నాకేమో వృకోదరుడి ఆకలి తీర్చాలనే ఆరాటం ఎక్కువ' అని సర్ది చెప్పింది. నేనూ అంతే.





తెలంగాణ మాతృమూర్తిగా నా తపన రైతు బిడ్డల కోసమే. పంటల్లేక, ధరల్లేక.. కొన్నిసార్లు రెండూ లేక నష్టపోతూనే ఉంటారు. ఏటా పరీక్షే. అందులో నెగ్గలేక, ఓటమికి తలొగ్గలేక ఉరితాడు మెడకు చుట్టుకునే దుర్భర జీవితాలు నన్ను కలవరానికి గురిచేసేవి. కన్నీళ్లు పెట్టించేవి. తల్లి మనసు తెలిసిన పెద్ద కొడుకుగా.. కేసీఆర్ ఆ నెర్రెలుబారిన నేలల్లో కాళేశ్వరం నీళ్లు పారించాడు. ఆ అతుకుల జేబుల్లో రైతుబంధు పైసలు పెట్టి.. పెట్టుబడికి సాయం చేశాడు. ఇరవై నాలుగు గంటల కరెంటుతో.. కటిక చీకటిని గెలిచే హరికేన్ లాంతరయ్యాడు. మద్దతు ధరతో మద్దతు పలికాడు. ధరణితో అసలు సిసలు పట్టాదారులకు పట్టాభిషేకం చేశాడు. ఇలాంటి పెద్దన్న ఎక్కడా దొరకడు. ఆ బంధాన్ని నిలుపుకోండి. ఆ నాయకుడికి ఓటేయండి.



❖ ❖ ❖

**ఆడపిల్లను** ఆదిలక్ష్మిలా చూసే సంప్రదాయం మనది. ఇంటికొస్తే పండుగ చేస్తాం. చీరసారెల కట్నం పెట్టి చిరునవ్వుతో సాగనంపుతాం. తన సంతోషమే మన సౌభాగ్యమని తలుస్తాం. అంతకు వెయ్యిరెట్ల సోదర ప్రేమ చూపిస్తున్నాడు నా బిడ్డ కేసీఆర్. ఏ ఆడపిల్లా బియ్యం నిండుకున్నాయని బాధపడకూడదు. దొడ్డ బియ్యం అన్నం పెనిమిటికి ఎలా వడ్డించాలా అని సంకోచించకూడదు. అందుకే, 'అన్నపూర్ణ పథకం' తీసుకొస్తున్నాడు. చిన్నాపెద్దా ఖర్చులుంటాయి. వ్యక్తిగత అవసరాలుంటాయి. కుటుంబ బాధ్యతలూ ఉంటాయి. పది రూపాయల కోసం కూడా ఇంటిపెద్ద మీద ఆధారపడాలంటే ఇల్లాలి మనసు చివుక్కుమంటుంది. ఇకనుంచి ఆ బాధ లేదు. కేసీఆర్ 'సౌభాగ్య లక్ష్మి' ఆదుకుంటుంది. నెలనెలా మూడువేలు ఖాతాలో పడతాయి. అత్తమామల చూపు మందగిస్తే 'కంటి వెలుగు' ఉంది. మందులు, మాకుల ఖర్చులకు పింఛన్లు ఇస్తున్నడాయె. బయటికెళ్లినప్పుడు ఏ బద్మాష్ గాడో ఈలకొట్టి గోలచేస్తే.. చితక్కొట్టడానికి షీటీమ్‌ను ఏర్పాటుచేశాడు. కూతురి పెండ్లికి కల్యాణలక్ష్మి, ప్రసవానికి కేసీఆర్ కిట్. ఆడపిల్లలు బిందెలు మోయాల్సిన కష్టం తప్పించడానికి ఏకంగా భగీరథుడినే ఇంటి ముందు దించాడు. కేసీఆర్ లాంటి అన్న ముఖ్యమంత్రిగా ఉన్నంత కాలం.. ఏ ఆడపిల్ల తల్లీ తన కూతుళ్ల గురించి ఆలోచించాల్సిన పన్లేదు. మూడుసార్లు కాదు.. ముప్పై సార్లయినా కేసీఆర్‌కే ఓటేస్తారు మీరు.

**కూతురి** మనసు అమ్మకే తెలుస్తుందని అంటారు. కానీ, అమ్మ మనసు తెలిసిన బిడ్డకు.. అక్కాచెల్లెళ్ల అంతరంగమూ అర్థం అవుతుంది. కొడుకంటే అట్లుండాలె. లీడర్ అంటే అట్లుండాలె. చెల్లెళ్ల మంచి కోరుకునే అన్నను గెలిపించడం ఆడబిడ్డల బాధ్యత. ఆ కర్తవ్యాన్ని గుర్తుచేయడం తల్లిగా నా బాధ్యత.



❖ ❖ ❖

**ఏ** అమ్మ అయినా.. చిన్నప్పుడు.. మంచి అలవాట్లు నేర్పుతుంది. మంచి స్నేహితుల గురించి చెబుతుంది. చదువుల ప్రాధాన్యం వివరిస్తుంది. మంచి భవిష్యత్తు వైపు నడిపిస్తుంది. కానీ, ఎలాంటి అభ్యర్థిని ఎంచుకోవాలి, ఎవరికి ఓటేయాలి అనేది ఎప్పుడూ చెప్పి ఉండదు. తెలంగాణ తల్లిగా ఆ బాధ్యత నేను తీసుకుంటున్నా. ఓ జాతీయ పార్టీ ఆరు పథకాలు పెద్ద తకరారని తెలిసిపోయి.. కన్నడ రాజ్యలక్ష్మి ఇప్పటికే కన్నీళ్లు పెడుతున్నది. తెలంగాణ ప్రజల్ని మాటలతో మభ్యపెట్టలేమని, ఉద్వేగాలతో ఓట్లు రాల్చుకోలేని ఢిల్లీ పూల వ్యాపారులకు అర్థమైపోయింది. మరో ఆలోచన వద్దు. కేసీఆర్‌కు ప్రత్యర్థులు లేరు. ప్రత్యామ్నాయమూ లేదు. 'కేసీఆర్ చచ్చుడో.. తెలంగాణ వచ్చుడో..' అంటూ, రాష్ట్రం కోసం జీవితాన్ని పణంగా పెట్టిన నేతకు.. 'కారుకు గుద్దుడు.. కేసీఆర్ గెలుసుడు' అంటూ ఓట్లతో మద్దతు పలకాల్సిన బాధ్యత మనదే. కొట్లాడి సాధించుకున్న రాష్ట్రాన్ని.. పదవుల కోసం కొట్టుకునేవారికి వారికి కట్టబెట్టకండి. మన ఇల్లు బాగుండాలంటే మన రాష్ట్రం బాగుండాలి. మనం సంతోషంగా ఉండాలంటే.. మన అధినాయకుడు అధికారంలో ఉండాలి.

మీ..
తెలంగాణ తల్లి!







## మీమ్ ఫైర్స్!



### దావత్ ఇయ్యాలె..మరి!

**తెలంగాణలో** దిల్‌ఖుష్ అయితే దావత్ ఉంటది. సంబురాన్ని సోపతోళ్లతో పంచుకునే సిల్‌సిలా మనది. బోనమెత్తితే నాటుకోడి దావతు. పోచమ్మకు పెడితే పొట్టేలు దావతు. శుభకార్యమైతే కల్లు బొట్టు దావతు. అంతెందుకు దోస్త్‌కు నచ్చిన చోట సీటొచ్చినా, ఆటల మనోడు గెలిచినా... పొద్దుగూకినంక దావత్ పక్కా! సందర్భం చిన్నదైనా సంబురాన్ని పెద్దదిగజేసే దావత్ అంటే ఇక్కడ చిన్నాపెద్దా అందరికీ ఇష్టమే. వ్యక్తికే కాదు... ఊరికి మేలు జరిగినా దావత్ చేసుడే! ఈ పదేండ్లలో తెలంగాణ ఇలాంటి దావత్‌లు మస్తు చేసుకున్నది. ఎండిన నేలల వైపు ఉరికొచ్చిన నీళ్లకు ఎన్ని హారతులు



పట్టినరు. పుట్లకు పుట్లు వడ్లు తూర్పారబోస్తున్నప్పుడు ఎంత దిష్టి తీసుకున్నరు. కావాలనుకున్నంత సేపు పంటకు నీళ్లు పెట్టుకుంట ఎట్ల పండుగ జేస్కున్నరు. పచ్చని పొలాల మధ్య ఫొటోలు దిగుకుంట ఎంత మురిసిపోయినరు. సల్లబడ్డ కడుపుతో చెట్టునీడన చేరి దోస్తులతో ముచ్చట పెడుతున్న రైతును చూసి ఊరు ఊరంతా దావత్ చేసుకుంటున్నది. ఒక్క రైతన్నే కాదు తెలంగాణ అచ్చినంక నేతన్న, గీతన్నా, గొర్లు కాసుకునే యాదవన్నా అందరూ బేఫికర్ అయినరు. ప్రతీ గుండె పురసత్‌గ దావత్ చేసుకుంటున్నది. ఇగ, ఆడబిడ్డ పెండ్లి కష్టం సర్కార్ చూస్కునే సరికి ఆ కన్న తండ్రి గుండె తీన్మార్ దరువేస్తున్నది. అదే కూతురు నీళ్లు పోస్కున్నాక.. పుట్టింటి సారె కన్నా ముందుగాల్లనే న్యూట్రిషన్ కిట్ వాయనంగా అందుతున్నది. సర్కార్ దిల్‌దార్‌గ ఇస్తున్న ఫింఛన్లతో అందరు నిమ్మలమైనరు. నిజంగనే ఈ పదేండ్లలో ఏ రాష్ట్రం చూడనన్ని దావత్‌లు కొత్తగ పుట్టిన తెలంగాణ చేసుకున్నది. అప్పుడే పుట్టిన పసిబిడ్డ నుంచి పండుటాకుల దాకా ప్రతి ప్రాణమూ ఈ దావత్ అందుకున్నది. మరి ఇన్ని దావత్‌లు ఇచ్చిన కేసీఆర్‌కు మనమూ దావత్ ఇయ్యాలె గదా! అదే ఓటు దావత్. రాష్ట్ర ప్రజలంతా కలిసి ఇచ్చే దావత్ ఓటు వేయడమే! ఇయ్యాల మనమూ కేసీఆర్ అడిగినట్టు ఆయనకు 'దావత్ ఇయ్యాలె.. మరి'!, కరెక్టే కదమ్మా!!

• హరిత

## థౌజండ్ వాలా..

